సర్దుకుంటున్నారు

- **పుంగనూరులోని వైసీపీ వీరభక్త అధికారుల్లో బదిలీ భయం**

పుంగనూరు, జూన్ 5: వైసీపీ ప్రభుత్వంలో పెద్దిరెడ్డికి వంతపాడుతూ.. వీరభక్తులుగా పేరు తెచ్చుకున్న అధికారులు సర్దుకుంటున్నారు. టీడీపీ కూటమి ఘన విజయంతో బదిలీల భయం పట్టుకుంది. మరోవైపు తమ తప్పుల్ని ఎక్కడ ఎత్తిచూపుతారోనన్న ఆందోళనా వీరిని వెంటాడుతోంది. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశిస్తే చాలు.. రాజ్యాంగానికి విరుద్ధమైనా చేయడానికి కొందరు అధికారులు అత్యుత్సాహం చూపారు. టీడీపీ శ్రేణులను ఇబ్బందులు పెట్టారు. పెద్దిరెడ్డికి తెలిస్తే ఏమవుతుందోనన్న ఆందోళనతో అధికారులు, ఉద్యోగులు ప్రతిపక్షాల వారితో మాట్లాడేవారే కాదు. వాళ్ల చెప్పే సమస్యలు, ఇబ్బందులను పట్టించుకున్న దాఖలాలు లేవు. కొందరు అధికారులు ఇంతలా వంగిపోయి పనిచేశారు. అధికారుల ద్వారా తన వ్యతిరేకుల ఆర్థిక మూలాలపై దెబ్బతీసిన సంఘటనలు అనేకంఉన్నాయి. పలువురు క్వారీ యజమానులను ఇబ్బందులు పెట్టి సీజ్ చేయించడం, అధికారుల తనిఖీలతో భారీగా జరిమానాలు వేయించడం, పోలీసు కేసులు పెట్టించారు. ఆ క్రమంలోనే.. పుంగనూరులో టీడీపీ కార్యాలయమున్న భవనాన్ని నిబంధనల విరుద్ధంగా కట్టారని, కూల్చేస్తామంటూ మున్సిపల్ అధికారులు యంత్రాలతో దిగిపోయి యజమానిని బెదిరించారు. చివరకు ఆయన రాత్రికి రాత్రే టీడీపీ సామగ్రిని బయట పెట్టి.. కార్యాలయాన్ని ఖాళీ చేయించారు. ఎక్కడ చూసినా వైసీపీ ఫ్లెక్సీలే కనిపిస్తాయి. టీడీపీవి ఉంటే అధికారులు తొలగిస్తారు. అనర్హులంటూ ఇల్లు బిల్లులు.. ప్రభుత్వ పథకాలు ఇవ్వకుండా, పింఛన్లు రద్దు చేయడం లాంటి అనేక చర్యలకు పాల్పడి టీడీపీ శ్రేణులను ఇబ్బంది పెట్టారు. ఇక పోలీసు అధికారులు హద్దుమీరి ప్రవర్తించారు. టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డితో పాటు దాదాపు 1000 మందిపై వివిధ కేసులు పెట్టారు. అందులో చంద్రబాబు పర్యటన సందర్భంగా జరిగిన రణరంగం, ఇతర సందర్భాల్లో 600 మంది వరకు హత్యాయత్నం కేసులు నమోదు చేశారు. 100 మందికిపైగా టీడీపీ శ్రేణులపై రౌడీషీట్లు తెరిచారు. బాధితులుగా ఉన్న టీడీపీ వారిపైనే పోలీసుల ద్వారా హత్యాయత్నం కేసులు పెట్టారు. నాటి ఎస్పీ రిషాంత్‌రెడ్డి, పలమనేరు డీఎస్పీ సుధాకర్ రెడ్డి, పుంగనూరు, చౌడేపల్లె సీఐలు గంగిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రస్తుత పుంగనూరు, చౌడేపల్లె, కల్లూరు సీఐలు బి.రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు, పలువురు ఎస్‌ఐల వ్యవహార శైలిపై తీవ్ర విమర్శలున్నాయి. ఇలా వైసీపీ ప్రభుత్వంలో పెద్దిరెడ్డి వీరభక్త అధికారులుగా పనిచేసిన పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీ రాజ్, ఇంజనీరింగ్, విద్యుత్, ఉపాధిహామీ, మెప్మా, అటవీ, రవాణా శాఖల్లోని పలువురు అధికారులు, ఉద్యోగులకు బదిలీలు తప్పవని తెలుస్తోంది. మరోవైపు కొందరు బయట ప్రాంతాల్లో మంచి పోస్టింగ్‌ల కోసం ఆరా తీస్తూ.. టీడీపీ నేతలను ప్రసన్నం చేసుకోవడానికి దారులు వెతుకుతున్నారు.

గతంలో ఎన్నడూలేనివిధంగా జిల్లాలో ఈసారి పోలీసు అధికారులు ఏకపక్షంగా పనిచేశారు. వైసీపీ నాయకుల్ని చూసుకుని ఎస్‌ఐ నుంచి ఎస్పీ వరకు ఐదేళ్ల పాటు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ప్రతిపక్షాలను శత్రువులుగా చూశారు. వైసీపీ నాయకుల ఆదేశాలతో కొందరు, అధికార పార్టీ మెహర్బానీ కోసం మరికొందరు రెచ్చిపోయారు. అక్రమ కేసులు.. బాధితులపై రివర్స్ కేసులు పెట్టడంలో జిల్లా పోలీసులు ఆరితేరిపోయారు. ఎన్నికల కోడ్ వచ్చాక చాలామంది తీరు మారినా, కొందరు మాత్రం ఏకపక్షంగా పనిచేశారు. జిల్లా, రాష్ట్రంలో కూటమికి భారీ ఆధిక్యత రావడంతో వైసీపీ కోసం పనిచేసిన ఆ పోలీసుల్లో ఇప్పుడు గుబులు మొదలైంది. గతంలో తాము చేసిన ఓవరాక్షన్‌ను, పెట్టిన ఇబ్బందుల్ని దృష్టిలో పెట్టుకుని టీడీపీ నాయకులు వేధిస్తారేమోనని ఆందోళనలో ఉన్నారు. ఈ ఐదేళ్లలో తాము చేసిన తప్పులను కొత్త ప్రభుత్వం ఎక్కడ వెలికితీస్తుందోనని మథనపడుతున్నారు. ఇప్పటి వరకు రెచ్చిపోయి పనిచేసిన వారికి నిద్ర కూడా పట్టడం లేదని తెలుస్తోంది.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



ఏమవుతుందో.. ఏమో!

- వైసీపీకోసం పనిచేసిన పోలీసుల్లో గుబులు
- ఐదేళ్లు ఏకపక్షంగా వ్యవహరించిన వైనం
- అక్రమ కేసులతో నిత్యం ప్రతిపక్షాలకు వేధింపులు
- ఎక్కడ కొత్త ప్రభుత్వం తమ తప్పుల్ని వెలికి తీస్తుందోనని ఆందోళన

జిల్లాను శాసించిన ఆ ముగ్గురు

జిల్లా పోలీసు శాఖలో మార్మోగిన పేర్లు మూడున్నాయి. ఎస్పీ రిషాంత్ రెడ్డి, డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐ గంగిరెడ్డి. ఈ ముగ్గురు జిల్లాను శాసించారనే విషయం ఏ పోలీసును అడిగినా చెబుతారు. యువగళం పాదయాత్రకు అడ్డంకులు సృష్టించడం, కుప్పంలో చంద్రబాబు పర్యటనను అడ్డుకోవడం, పుంగనూరులో చంద్రబాబు పర్యటన సమయంలో వైసీపీ కవ్వింపు చర్యలు.. తద్వారా చెలరేగిన అల్లర్లు.. వంటివన్నీ వీరి హయాంలోనే జరిగాయి. వీరి హయాంలోనే కుప్పం, పుంగనూరు నియోజకవర్గాల్లో ప్రతిపక్షాలపై ఇష్టానుసారంగా అక్రమ కేసులు పెట్టారు. రౌడీ షీట్లు తెరిచారు. హత్యాయత్నం కేసులు పెట్టి టీడీపీ నాయకుల్ని జైలుకు పంపించారు. నారా లోకేశ్ ఈ ముగ్గురి పేర్లు రెడ్ బుక్‌లో ఉన్నాయని పలుమార్లు ప్రస్తావించిన విషయం తెలిసిందే.ఈ ముగ్గురూ ప్రస్తుతం జిల్లాలో పనిచేయడం లేదు. కానీ, ఇక్కడి పాపం.. వారిని వెంటాడుతుందని పోలీసు వర్గాలు అంటున్నాయి.

కుప్పంలో ఆ సీఐ అత్యుత్సాహం

కుప్పం ప్రతిపక్ష నాయకుడి నియోజకవర్గం, పరిస్థితులు మారితే ఆయన సీఎం అవుతారని తెలిసినా సీఐ శ్రీధర్ హల్‌చల్ చేశారు. టీడీపీ అనే పేరు వినిపిస్తే చాలు.. బూతులు తిట్టడం, కొట్టడం ఇతడికి అలవాటు. ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో బదిలీ అయిన ఈయన్ను అక్కడి ఎమ్మెల్సీ భరత్ మరోసారి కుప్పం తెచ్చుకున్నారంటే ఇతడు వైసీపీకి ఏ విధంగా వంత పాడారో తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన ఎన్నికల కోడ్ కారణంగా జిల్లా కేంద్రంలోని సోషల్ మీడియా విభాగంలో ఉన్నారు.

చిత్తూరులోనూ..

చిత్తూరు నియోజకవర్గంలోనూ కొంత మంది పోలీసు అధికారులు ఏకపక్షంగా పనిచేశారు. మాజీ మేయర్ హేమలత మీద సీఐ యతీంద్ర జీపు ఎక్కించగా.. ఆమె మూడు నెలలు మంచానికి పరిమితమయ్యారు. ప్రస్తుత వన్‌టౌన్ సీఐ విశ్వనాథ్‌రెడ్డి కోడ్ వచ్చినా కూడా లెక్క చేయకుండా వైసీపీ కోసం పనిచేశారన్న విమర్శలున్నాయి. టీడీపీ నాయకుల పట్ల దురుసుగా ప్రవర్తించి వైసీపీ అభ్యర్థి విజయానందరెడ్డి అజెండాను అమలు చేశారని అంటారు. విజయానంద రెడ్డి కోసం ఏకపక్షంగా పనిచేశారంటూ గుడిపాల ఎస్‌ఐ శ్రీనివాసరావును ఈసీ సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.

పుంగనూరులో ప్రతి పోలీసూ..

పుంగనూరు నియోజకవర్గంలోని పోలీసు అధికారులంతా పెద్దిరెడ్డి కోసమే ఏకపక్షంగా పనిచేశారు. టీడీపీ నాయకుల్ని నిత్యం వేధించారు. గతంలో పనిచేసిన పుంగనూరు, చౌడేపల్లె సీఐలు గంగిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి స్థానిక సంస్థల ఎన్నికల్లో అక్రమ ఏకగ్రీవాలు జరిగేందుకు వైసీపీకి సహకరించారు. ప్రస్తుత చౌడేపల్లె సీఐ రామకృష్ణారెడ్డి పెద్దిరెడ్డి అజెండాను అమలు చేశారు. సదుంలో బీసీవై అధినేత రామచంద్రయాదవ్ మీద జరిగిన దాడిలోనూ సీఐ ఫెయిల్యూర్ ఉంది. అయినా ఎస్‌ఐ మారుతి రావును సస్పెండ్ చేసి, పెద్దిరెడ్డి సామాజికవర్గానికి చెందిన సీఐను మాత్రం కాపాడుకున్నారు. టీడీపీ వారిపై దాడులు జరిగినా రివర్స్‌గా వారి మీదే కేసులు పెట్టారు. ప్రస్తుత సీఐ రాఘవరెడ్డి టీడీపీ నాయకుల మీద రౌడీ షీట్లు తెరవడం, చంద్రబాబు పర్యటన సందర్భంగా జరిగిన దాడి సంఘటనలో టీడీపీ శ్రేణుల మీద కేసులు పెట్టి అరెస్టు చేయడం వంటివి చేశారు.

70 శాతం ఉద్యోగుల ఓట్లు టీడీపీకే



చిత్తూరులోని కౌంటింగ్ కేంద్రంలో మంగళవారం పోస్టల్ బ్యాలెట్లను లెక్కిస్తున్న సిబ్బంది

ఆయా పార్టీలకు నియోజకవర్గాల వారీగా పడిన పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఇలా..

నియోజకవర్గం	పోలైనఓట్లు	టీడీపీ	వైసీపీ	మెజార్టీ	శాతం
పలమనేరు	2048	1534	514	1020	75
కుప్పం	1336	1003	333	666	75
జీడీనెల్లూరు	2300	1721	579	1142	75
నగరి	2267	1703	564	1139	75
చిత్తూరు	3395	2332	1063	1269	69
పూతలపట్టు	2404	1545	859	686	64
పుంగనూరు	2562	1543	1019	524	60
మొత్తం	**16312**	**11381**	**4931**	**6446**	**70**

చిత్తూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్న ఉద్యోగులు ఎన్నికల్లో తామేంటో చూపించారు. సుమారు రెండు మూడు గంటలు క్యూలో నిలబడి మరీ బ్యాలెట్ ఓటేశారు. జిల్లాలో 16312 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఓటేయగా.. వారిలో 70శాతం మంది (11381 మంది) టీడీపీకే ఓట్లేశారు. మిగిలిన 30 శాతం మంది వైసీపీ అభ్యర్థులకు ఓటేశారు. పలమనేరు, కుప్పం, జీడీనెల్లూరు, నగరి ప్రాంతాల్లో 75శాతం మంది, చిత్తూరులో 69, పూతలపట్టులో 64, పుంగనూరులో 60 శాతం మంది ఉద్యోగులు టీడీపీని కోరుకున్నారు.

- *చిత్తూరు పార్లమెంటు స్థానం విషయానికొస్తే.. 12,535 ఓట్లు టీడీపీకి, 5123 ఓట్లు వైసీపీ పడ్డాయి. 194 ఓట్లను తిరస్కరించగా, 164 మంది నోటాకు వేశారు.*

థ్యాంక్యూ ఆల్!

- **కలెక్టర్ షన్మోహన్**



చిత్తూరు కలెక్టరేట్, జూన్ 5: అందరి సహకారంతో ఎన్నికలు విజయవంతంగా పూర్తిచేయగలిగామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ బుధవారం తెలిపారు. కొన్ని రోజులుగా ఎన్నికల సిబ్బంది ఏకతాటిపై అలుపెరుగకుండా విధులు నిర్వహించారన్నారు. ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చారన్నారు. కిందిస్థాయి ఉద్యోగుల నుంచి పైస్థాయి అధికారి వరకు అంకితభావంతో పనిచేశారని పేర్కొన్నారు. పరస్పర సహకారంతో ఎన్నికల విధులు సజావుగా నిర్వహించారని తెలిపారు. ఉద్యోగులు, ప్రజల సహకారంతో ఎన్నికలను సమర్థంగా నిర్వహించగలిగామన్నారు. ప్రధానంగా రిటర్నింగ్ అధికారులు అంకితభావంతో పనిచేశారన్నారు. ఎన్నికల విధుల నిర్వహణపై ఉద్యోగులు శిక్షణ ఇవ్వడంలో సఫలీకృతమయ్యారని చెప్పారు. పోలీసులు సైతం అవాంఛనీయమైన సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారన్నారు. ఎన్నికల విధుల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న ప్రతిఒక్కరికీ పేరుపేరున ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

వెనక్కి వస్తున్న 17వేల ఈవీఎంలు

కౌంటింగ్ కేంద్రాల నుంచి కలెక్టరేట్ గోదాముకు

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 5: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సాఫీగా, ఎటువంటి ఇబ్బందులు లేకుండా మంగళవారం రాత్రితో ముగిసింది. అనంతరం కౌంటింగ్ కేంద్రంలో ఉన్న ఈవీఎంలను బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు నియోజకవర్గాల వారీగా ప్రత్యేక వాహనాల్లో గట్టి పోలీసు బందోబస్తు మధ్య కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదాములకు తీసుకొచ్చారు. చిత్తూరు పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల కోసం 1771 పోలింగ్ కేంద్రాలకు రిజర్వుతో కలిపి 17వేల ఈవీఎంలను వినియోగించుకున్నారు. మే 13న పోలింగ్ ముగిశాక ఈవీఎంలను చిత్తూరులోని ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాలకు తీసుకొచ్చి స్ట్రాంగ్‌రూమ్‌లో భద్రపరిచారు. ఓట్ల లెక్కింపు ముగిశాక.. బుధవారం వీటిని కలెక్టరేట్‌లోని గోదాముకు తీసుకొచ్చి భద్రపరిచారు. అందులో అభ్యర్థులకు పడ్డ ఓట్ల వివరాలు స్టోరేజీలో ఉన్నాయి. ఫలితాలపై ఏ అభ్యర్థి అయినా భవిష్యత్తులో కోర్టుకు వెళితే ఓట్ల వివరాలు కోర్టుకు అందించాల్సి ఉంటుంది. అందుకోసం స్టోరేజ్‌లోని వివరాలను 45రోజుల పాటు అట్టే ఉంచుతారు. దీంతో పాటు కౌంటింగ్ ప్రక్రియ కోసం వినియోగించిన ఇతర ఎన్నికల సామగ్రిని కూడా మరో గోదాముకు తరలించి ఇంజినీరింగ్ కాలేజ్‌లోని స్ట్రాంగ్‌రూమ్‌లను ఖాళీ చేస్తున్నారు.



మొదటి విజేతను ప్రకటిస్తున్న ఆంధ్రజ్యోతి సిబ్బంది

'ఎవరు గెలిచినా మీదే గెలుపు' విజేత తిరుపతివాసి

ఆంధ్రజ్యోతి కార్యాలయంలో లక్కీడ్రా

నలుగురు విజేతలకు బహుమతులు

తిరుపతి , జూన్ 5 (ఆంధ్రజ్యోతి) : 'శాసనసభ ఎన్నికల్లో ఎవరు గెలుస్తారు?' అనే అంశంపై ఆంధ్రజ్యోతి నిర్వహించిన లక్కీడ్రాకు పాఠకుల నుంచి విశేష స్పందన లభించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 14 అసెంబ్లీ స్థానాల్లో ఏ పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొందుతుందో పాఠకుల నుంచే అంచనాలు వేస్తూ కూపన్లు స్వీకరించిన విషయం తెలిసిందే. అలా వచ్చిన వేలాది కూపన్ల నుంచి బుధవారం సాయంత్రం తిరుపతిలోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. కూపన్లు పంపిన వారిలో తిరుపతిలోని చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన పి.శ్రీనివాసులు ప్రథమ బహుమతి కింద 10వేల రూపాయలు గెలుచుకున్నారు. అలాగే మూడు ద్వితీయ బహుమతులను తిరుపతి సమీపంలోని తిరుచానూరు శంకర నాయుడు కాలనీకి చెందిన సీఆర్ ఖాదర్ బాషా, తిరుపతిలోని కుమ్మరతోపునకు చెందిన వి.మురళీకృష్ణ, చిత్తూరు గ్రీమ్స్‌పేటలోని గాయత్రీనగర్‌కు చెందిన ఈఎం ప్రసాద్ గెలుచుకున్నారు. వీరికి రూ.5వేల చొప్పున బహుమతులను త్వరలో అందజేస్తారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వర రావు, బ్రాంచ్ మేనేజరు సురేష్ రెడ్డి , అడ్వర్టయిజ్‌మెంట్ మేనేజరు ఈశ్వరనాయుడు, సర్క్యులేషన్ మేనేజరు ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో 'జయహో టీడీపీ'



టీడీపీ అధికారంలోకి రావడంతో కుప్పంలో పార్టీ శ్రేణులు జయహో అంటూ బుధవారం విజయోత్సవం జరుపుకొన్నారు. చంద్రబాబు గెలిచినట్లు ఎన్నికల అధికారి ఇచ్చిన డిక్లరేషన్ ఫారాన్ని గంగమ్మ పాదాల ముందు ఉంచి ఎమ్మెల్సీ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. అక్కడనుంచి ఆర్టీసీ బస్టాండు కూడలిదాకా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు.

- కుప్పం



నామినేటెడ్ పదవులకు పలువురి రాజీనామా

మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి రాజీనామా చేసిన సురేష్


బుల్లెట్ సురేష్

చిత్తూరు, జూన్ 5: టీడీపీ కూటమి ఘన విజయం.. వైసీపీ అధికారం కోల్పోవడంతో పలువురు నేతలు తమ నామినేటెడ్ పదవులకు బుధవారం రాజీనామాలు చేశారు. చిత్తూరుకు చెందిన బుల్లెట్ సురేష్ ఏపీ మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి రాజీనామా చేసి.. ఆ పత్రాన్ని బీసీ వెల్ఫేర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీకి పంపారు. ఈయన రెండేళ్ల కాలపరిమితి ముగిసినా.. మళ్లీ మరో రెండేళ్లు పొడిగించారు.

పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి..


రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న హేమంత్‌కుమార్‌రెడ్డి

పలమనేరు: పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి హేమంత్‌కుమార్‌రెడ్డి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను మార్కెట్ కమిటి కార్యదర్శి సంజీవకుమార్‌కు అందజేశారు. 2019 ఎన్నికలకు ముందు పలమనేరు మార్కెట్ కమిటి చైర్మన్‌గా హేమంత్‌కుమార్‌రెడ్డి అప్పట్లో ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన జగన్ సమక్షంలో టీడీపీ నుంచి వైసీపీలో చేరారు. 2022 జూన్ 27న హేమంత్‌కుమార్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్‌గా వైసీపీ ప్రభుత్వం నియమించింది. ఏడాది తర్వాత రెండుసార్లు ఆయన పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడిగిస్తూ వచ్చింది. ఆ పదవీ కాలం కూడా ఈనెల 26న ముగియనుంది. ఈ క్రమంలో వైసీపీ అధికారం కోల్పోవడంతో 20 రోజులు ముందుగానే ఆయన రాజీనామా చేశారు.

గాండ్ల కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి..


మేలిపాటి పురుషోత్తం

వెదురుకుప్పం: వైసీపీ అధికారం కోల్పోవడంతో గాండ్ల, తెలికుల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవికి రాజీనామా చేసినట్లు మేలిపాటి పురుషోత్తం బుధవారం తెలిపారు. తన రాజీనామా లేఖను ఏపీ చీఫ్ సెక్రటరీ, బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంటుకు పంపినట్లు చెప్పారు.

ద్రావిడ వర్సిటీ రెక్టార్ రాజీనామా


ఆచార్య అనురాధ

గుడుపల్లె: ద్రావిడ విశ్వవిద్యాలయం రెక్టార్ అనురాధ తన పదవికి బుధవారం రాజీనామా చేశారు. ఈ మేరకు తన ఆమె రాజీనామా పత్రాన్ని వీసీ ఆచార్య మధుజ్యోతికి అందజేశారు. కంప్యూటర్ సైన్స్ శాఖలో ఆచార్యులుగా పనిచేస్తున్న అనురాధ 2022లో రెక్టార్‌గా నియమితులయ్యారు. అంతకు ముందు ఆమె రిజిస్ట్రార్‌గా, ఇన్‌చార్జ్ వీసీగా కూడా పనిచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోడంతో ఆమె తన పదవికి రాజీనామా సమర్పించినట్లు తెలిసింది. కాగా, ఈమె రాజీనామాను వీసీ ఆమోదించలేదు.

రుయాస్పత్రికి ప్రత్యేక అడ్మిన్

మే 20న బాధ్యతలు స్వీకరించిన కనక నరసారెడ్డి



తిరుపతి (వైద్యం), జూన్ 5: ఎస్వీ వైద్య కళాశాల (ఎస్వీఎంసీ)తో పాటు దానికి అనుబంధంగా ఉన్న రుయాస్పత్రికి ప్రత్యేక అడ్మినిస్ట్రేటర్ పోస్టును సృష్టించిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.వైసీపీ ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు డిప్యూటీ కలెక్టర్ల బదిలీల్లో భాగంగా మార్చి 10న జీవో విడుదల చేసింది. తిరుపతి ఆర్డీవోగా పనిచేసిన కనకనరసారెడ్డిని రుయా అడ్మిన్‌గా నియమించినట్టు ఉత్తర్వులో పేర్కొంది. ఆ మేరకు గత నెల 20న వైద్యఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు సమక్షంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు.ఎన్నికల క్రతువు ముగిసిన అనంతరం బుధవారం రుయా అధికారులను కలిశారు. గతంలో ఆస్పత్రి వర్కింగ్ చైర్మన్‌కు కేటాయించిన ఛాంబర్‌ను ఏర్పాటుచేసే పనిలో యంత్రాంగం ఉంది. స్విమ్స్, బర్డ్ ఆస్పత్రులపై టీటీడీ జేఈవో పర్యవేక్షణ ఉన్నట్టు రుయా, ఎస్వీఎంసీ పరిపాలనా బాధ్యతలను ఐఏఎస్ స్థాయి అధికారికి అప్పగించాలని వైసీపీ ప్రభుత్వం భావించింది. ఇందుకు వైద్యకళాశాల ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్ స్థాయిలో ఉన్న అధికారులు విముఖత చూపుతుండటంతో ఇది వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ఎన్నికల ముందు తీసుకున్న నిర్ణయం కొనసాగుతుందా? లేదా రద్దవుతుందా? అన్న చర్చ జరుగుతోంది.

సత్యవేడు సెంటిమెంట్ పదిలం

● ఇక్కడ గెలిచే పార్టీదే అధికారం

సత్యవేడు, జూన్ 5: సత్యవేడులో గెలిచే పార్టీయే రాష్ట్రంలో అధికారం చేపడుతుందన్న సెంటిమెంట్ ఈ ఎన్నికల్లో కూడా కొనసాగింది. ఉమ్మడి ఏపీలో టీడీపీ ఆవిర్భావం తరువాత 2009 ఎన్నికల్లో మినహా అన్ని ఎన్నికల్లో సత్యవేడు నియోజకవర్గంలో గెలిచిన పార్టీయే రాష్ట్రంలో అధికారం చేపడుతూ వస్తోంది. ఇందుకు నిదర్శనంగా 1983లో టీడీపీ అభ్యర్థి తలారి మనోహర్ గెలుపొందగా రాష్ట్రంలో టీడీపీ అధికారం చేపట్టింది. 1985లో మధ్యంతర ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి ఎం.సురాజ్ గెలుపొందగా టీడీపీదే అధికారం, 1989 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సి.దాసు గెలుపొందగా ఆ పార్టీ అధికారం చేపట్టింది, 1994లో టీడీపీ అభ్యర్థి ఎం.సురాజ్ గెలుపొందగా టీడీపీ అధికారంలోకి వచ్చింది, 1999లో టీడీపీ అభ్యర్థి శివప్రసాద్ గెలుపొందగా టీడీపీ అధికారం కొనసాగింది. 2004లో కాంగ్రెస్ అభ్యర్థి నారాయణస్వామి గెలుపొందగా కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. 2009లో మాత్రం టీడీపీ అభ్యర్థి హేమలత గెలుపొందగా కాంగ్రెస్ పార్టీయే అధికారం చేపట్టింది. 2014లో విభజిత ఏపీలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి తలారి ఆదిత్య గెలుపొందగా ఆ పార్టీ అధికారం చేపట్టింది. 2019లో వైసీపీ అభ్యర్థి ఆదిమూలం గెలుపొందగా వైసీపీ అధికారం చేపట్టింది. ప్రస్తుత ఎన్నికల్లో ఆయనే టీడీపీ తరపున గెలుపొందగా రాష్ట్రంలో టీడీపీ కూటమి అధికారం చేపడుతుండడం విశేషం.

కుప్పంలో అన్ని శాఖలపై విచారణ

అన్ని దాడులకూ వడ్డీ సహా చెల్లిస్తాం ● ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ స్పష్టీకరణ


టీడీపీ నాయకులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

కుప్పం, జూన్ 5: కుప్పంలో అవినీతిమయమైన అన్ని ప్రభుత్వ శాఖలు, కార్యాలయాల్లో విచారణ తప్పదని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ఈ ఐదేళ్లు టీడీపీ నాయకులు, కార్యకర్తలపై జరిగిన దాడులకు, దౌర్జన్యాలకు పాల్పడినవారిపై కచ్చితంగా వడ్డీ సహా బదులు చెల్లిస్తామని హెచ్చరించారు. కుప్పంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం టీడీపీ నాయకులు గౌనివారి శ్రీనివాసులు, డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, పి.మనోహర్, రాజ్‌కుమార్ తదితరులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడికి ఘన విజయాన్ని అందించిన కుప్పం ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కుప్పం రెస్కోలో జరిగిన అవకతవకలపై సీఐడీ విచారణ చేపడతామన్నారు. రెస్కో ఎండీ ప్రభాకర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కుప్పం మున్సిపాలిటీలోనూ అనేక అవకతవకలు జరిగాయని, ఇక్కడా త్వరలోనే విచారణ జరిపించి అవినీతిని బయట పెడతామన్నారు.ఈ రెండు సంస్థలే కాక, నియోజకవర్గ పరిధిలో ఆయా శాఖల్లో జరిగిన అవినీతి చర్యలు, అక్రమాలపై కచ్చితంగా విచారణలు జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవడం తప్పదన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు వైసీపీ అరాచకాలకు, దాడులకు ఇబ్బందులపాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబాలకు కూడా దూరంగా అజ్ఞాతంలో బతకాల్సిన దుర్భర పరిస్థితులు వైసీపీ పాలనలో ఎదురయ్యాన్నారు. తమ పార్టీ శ్రేణుల జోలికి వస్తే ఎలా ఉంటుందో ఇక వైసీపీ మూకలు చూస్తాయన్నారు. కుప్పంలో చంద్రబాబును ఓడిస్తామని బీరాలు పలికి నాయకులు ఇప్పుడు ఎక్కడున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ఓడిపోతే తాను రాజీనామా చేస్తానని సవాల్ విసిరినా, వైసీపీ ఎమ్మెల్సీ భరత్ ఆ సవాల్‌ను స్వీకరించలేదని గుర్తుచేశారు. కుప్పంలో ఇన్నాళ్ల అరాచకాలకు, తన ఓటమికి బాధ్యత వహిస్తూ ఎమ్మెల్సీ పదవికి భరత్ రాజీనామా చేసి, ప్రజలకు క్షమాపణ చెప్పాలన్నారు. ఐదేళ్ల టీడీపీ పాలనలో మ్యానిఫెస్టోలోని అన్ని హామీలను అమలు పరుస్తామని హామీ ఇచ్చారు. కుప్పం నియోజకవర్గ అభివృద్ధికి టీడీపీ, చంద్రబాబు ఎప్పుడూ కట్టుబడి ఉంటారని, రాబోయే రోజుల్లో ఇక్కడి ప్రజల పట్ల ఆయన నిబద్ధత ఏమిటో అందరూ చూస్తారని కంచర్ల స్పష్టం చేశారు.

చిత్తూరు రికార్డ్ : దగ్గుమళ్ల మెజార్టీ

● 2.20 లక్షల ఓట్ల ఆధిక్యంతో గెలిచిన టీడీపీ అభ్యర్థి


దగ్గుమళ్లను సన్మానిస్తున్న పార్టీ శ్రేణులు

చిత్తూరు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు భారీ ఓట్ల ఆధిక్యతతో విజయం సాధించారు. చిత్తూరు పార్లమెంటు చరిత్రలో ఈ స్థాయి మెజార్టీ గతంలో ఎవరికీ రాలేదు. దీంతో దగ్గుమళ్ల రికార్డు సృష్టించినట్లయింది. బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గానికి చెందిన ఈయన ఐఆర్ఎస్ అధికారిగా ఇన్‌కమ్‌ట్యాక్స్ డిపార్ట్‌మెంటులో దేశంలోని అనేక రాష్ట్రాల్లో పనిచేశారు. చంద్రబాబు పట్ల ఆకర్షితులై ముందస్తు పదవీ విరమణ చేసి రాజకీయాల్లోకి వచ్చారు. ఆయన బాపట్ల ఎంపీ స్థానాన్ని ఆశించినా, చంద్రబాబు ఆయన్ను చిత్తూరు ఎంపీ స్థానానికి పంపించారు. ఆయన చిత్తూరుకు రాగానే పార్లమెంటు పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యే అభ్యర్థులతో కలిసి సమన్వయంతో ముందుకు వెళ్లారు. తక్కువ సమయంలోనే ప్రచారంలో దూసుకుపోయారు. ఐదేళ్ల పాటు ఎంపీగా పనిచేసిన రెడ్డెప్ప రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డికి అనుచరుడిగా, ఇంట్లో పనిషిగా ఉన్నారే తప్ప ఎన్నడూ తన మార్కుచూపించలేదు. దగ్గుమళ్ల మాత్రం తక్కువ సమయంలోనే డమ్మీ అభ్యర్థిగా కాకుండా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తద్వారా ఓటర్లను ఆకట్టుకున్నారు. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని ఓట్లను 21 రౌండ్లలో లెక్కించగా.. ప్రతిసారీ టీడీపీకే మెజార్టీ వచ్చింది. ఒక్కో రౌండులో సగటున ఆయనకు 10 వేలకుపైగా మెజార్టీ దక్కింది. ఆరో రౌండ్‌లో అత్యధికంగా 17 వేలు, పదో రౌండులో 14851 ఓట్లు వచ్చాయి. మొత్తంగా ఆయనకు 2,20,479 ఓట్ల మెజార్టీ దక్కింది. దీంతో బుధవారం పార్టీ శ్రేణులు, అభిమానులు చిత్తూరులోని ఆయన కార్యాలయంలో అభినందనలు తెలిపి సన్మానించారు.

ఊహించని మెజార్టీ ఇది

చిత్తూరు ఎంపీగా ఎన్నికైన దగ్గుమళ్ల ప్రసాదరావు బుధవారం చిత్తూరులోని తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'చంద్రబాబు ప్రోత్సాహం, ప్రజల ఆశీస్సులే, పార్టీ శ్రేణుల సహకారంతోనే గెలిచాను. ఈ స్థాయిలో మెజార్టీ వస్తుందని అనుకోలేదు. ఇచ్చిన హామీలకు కట్టుబడి చిత్తశుద్ధితో పనిచేస్తాను. నాకు ఇంత భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు, కార్యకర్తలకు రుణపడి ఉంటాను'అని పేర్కొన్నారు.

సాధించాను ... నాన్నా!



ముద్దుకృష్ణమ రాజకీయ వారసత్వాన్ని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ముందుకు తీసుకెళుతున్నారు.మంగళవారం రాత్రి నగరి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే డిక్లరేషన్ అందుకున్న భానుప్రకాష్ కుటుంబసభ్యులతో కలిసి రామచంద్రాపురం మండల పరిధిలోని వెంకట్రామాపురం చేరుకున్నారు.తన తండ్రి, మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడికి సమాధి వద్ద ఘన నివాళి అర్పించడంతో పాటు డిక్లరేషన్‌ను సమాధిపై ఉంచి కొద్ది సేపు ప్రార్థనలు చేశారు.నామినేషన్ దాఖలుకు ముందు కూడా ఆయన తండ్రి సమాధి వద్ద పత్రాలను కాసేపు ఉంచి ఆర్వో కార్యాలయానికి బయల్దేరిన విషయం తెలిసిందే.

-పుత్తూరు అర్బన్

పుంగనూరులో టీడీపీ కార్యకర్తపై దాడి

● బుల్లెట్‌తో ఢీకొట్టి చంపబోయిన వైసీపీ కార్యకర్త


టీడీపీ కార్యకర్త షామీర్‌ను వెనుకనుంచి బుల్లెట్‌తో ఢీ కొడుతున్న వైసీపీ కార్యకర్త ఇమ్రాన్ (నల్లషర్టు వ్యక్తి)

పుంగనూరు, జూన్ 5: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ కూటమి ఘనవిజయాన్ని జీర్ణించుకోలేని వైసీపీ కార్యకర్త పుంగనూరులో ఆ పార్టీ కార్యకర్తపై దాడి చేశాడు. బుల్లెట్‌తో ఢీకొట్టి హతమార్చబోయాడు. బుధవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి బాధితుడు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పుంగనూరు ఉబేదుల్లా కాంపౌండ్‌లో కాపురమున్న షేక్ షామీర్, సయ్యద్ అలియాస్ జంగిల్ చురుకైన టీడీపీ కార్యకర్తలు. సయ్యద్ కౌంటింగ్‌సెంటర్‌లో టీడీపీ ఏజెంట్‌గా ఉండగా అతడి స్నేహితులకు రాతిమసీదు వీధిలో కాపురం ఉన్న ఎస్.నజీర్ కుమారుడు వైసీపీ కార్యకర్త ఎస్.ఇర్ఫాన్ ఫోన్‌లో వార్నింగ్ ఇచ్చాడు. బుధవారం ఉదయం టీడీపీ కార్యకర్త షామీర్ ఈవిషయంపై విచారించడానికి ఇమ్రాన్ ఇంటివద్దకు వెళ్లారు. ఇతడిపై వైసీపీ కార్యకర్త ఇమ్రాన్ మరికొందరు దాడి చేసి చొక్కా చింపి కొట్టారు. ఇంది రాసర్కిల్‌లో కొత్తయిండ్లుకు చెందిన నాగరాజ, దూళ్లవాండ్లఇండ్లుకు చెందిన రాఘవతో షామీర్ మాట్లాడుతున్నారు. అదే సమయంలో వైసీపీ కార్యకర్తలు ఇర్ఫాన్, అష్రఫ్ బుల్లెట్ (ద్విచక్రవాహనం)లో వేగంగా వచ్చి వెనుకవైపు నుంచి అతడిని ఢీకొట్టారు. దీంతో కిందపడిపోయిన తనను స్నేహితులు పైకిలేపి అడ్డు రావడంతో.. వారినీ ఇమ్రాన్ దుర్భాషలాడి దాడి చేశాడని షామీర్ తెలిపారు. రాఘవను కులం పేరుతో దూషించినట్లు చెప్పారు. తనను అసభ్యకరంగా బూతులు తిడుతూ దాడి చేసి బుల్లెట్‌తో ఢీ కొట్టి హతమార్చాలని ప్రయత్నించిన వైసీపీ కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

అసభ్య పదజాలంలో వైసీపీ కార్యకర్తల పోస్టులు

● ప్రశ్నించిన టీడీపీ కార్యకర్తను అంతుచూస్తామని హెచ్చరిక

రామకుప్పం, జూన్ 5: మండలంలోని 89పెద్దూరు పంచాయతీ ననియాలకు చెందిన వైసీపీ కార్యకర్త కమలనాథ్ మంగళవారం రాత్రి టీడీపీ అధినేత చంద్రబాబుపై అసభ్యపదజాలంతో వ్యాఖ్యలు చేస్తూ తన వాట్సాప్ స్టేటస్‌లో అప్‌లోడ్ చేశారు. దీనిపై స్థానిక టీడీపీ కార్యకర్త రాజశేఖర్ బుధవారం ఉదయం కమలనాథ్‌ను ప్రశ్నించారు. ఈ సందర్భంగా తనను కులం పేరుతో దూషిస్తూ, అంతు చూస్తానని కమలనాథ్ హెచ్చరించినట్లు బాధితుడు తెలిపారు. అంతేకాకుండా కమలనాథ్ తల్లి రమణమ్మకు ఫోన్ చేయగా ఆమె కూడా కులం పేరుతో దూషించినట్లు చెప్పారు. కమలనాథ్, అతడి తల్లిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు రాజశేఖర్ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


ఆత్మహత్యకు పాల్పడిన త్రివేణి

పుంగనూరు రూరల్, జూన్ 5: అనుమానాస్పద స్థితిలో ఓ వివాహిత మృతి చెందిన ఘటన బుధవారం పుంగనూరు మండలంలో చోటు చేసుకుంది. కుటుంబీకుల కథనం మేరకు... పెద్దపంజాణి మండలం ముత్తుకూరు పంచాయతీ పోలేపల్లెకు చెందిన త్రివేణి(26)కి, పుంగనూరు మండలం నెక్కుంది గ్రామానికి చెందిన నరేశ్(31)తో ఆరు నెలల క్రితం వివాహమైంది. భార్యాభర్తలు బెంగళూరులో పని చేస్తూ జీవనం సాగిస్తుండేవారు. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో మంగళవారం ఉదయం ఇద్దరూ నెక్కుందికి చేరుకున్నారు. తాను మరణిస్తున్నట్లు నరేశ్ లెటర్ రాసి ఇంట్లోని టీవీ వెనుక పెట్టి స్నేహితుడికి సమాచారం ఇచ్చినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మళ్లీ సాయంత్రం 4గంటల సమయంలో తాను క్షేమంగా ఉన్నట్లు సెల్‌ఫోన్ నుంచి సమాచారం ఇచ్చారు. అయితే బుధవారం తెల్లవారగానే ఇంటిలో త్రివేణి కనిపించకపోగా చుట్టుపక్కల వెతికారు. గ్రామ సమీపంలోని పొలాల్లో చెట్టుకు ఉరేసుకుని ఉన్న ఆమెను స్థానికులు గుర్తించి కుటుంబీకులకు సమాచారమిచ్చారు. వెంటనే ఆమెను పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా, అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించినట్లు పోలీసులకు తెలిపారు. త్రివేణి ఆత్మహత్య చేసుకుందా, అనుమానాస్పదంగా మృతి చెందిన విషయాన్ని పోలీసులు ఛేదించాల్సింది.

22 మండలాల్లో వర్షం


చిత్తూరు నగరంలో కురుస్తున్న వర్షం

చిత్తూరు కలెక్టరేట్, జూన్ 5: జిల్లా వ్యాప్తంగా అల్పపీడన ప్రభావంతో గడిచిన 24 గంటల్లో 22 మండలాల్లో తేలిక పాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. గంగాధరనెల్లూరులో 38.2మి.మీ, నగరి 34.8, కార్వేటినగరం 34.2, బంగారుపాళ్యం 32.0, తవణంపల్లె 26.4, శ్రీరంగరాజపురం 23.6, చిత్తూరు అర్బన్ 23.0, బైరెడ్డిపల్లి 19.4, చిత్తూరు రూరల్ 15.0, నింద్ర 11.6, సదుం 11.2, రామకుప్పం 9.8, పెద్దపంజాణి 8.6, గంగవరం 8.6, శాంతిపురం 8.2, పలమనేరు 7.2, పూతలపట్టు 7.0, ఐరాల 6.2, యాదమరి 3.6, వెదురుకుప్పం 3.4, పుంగనూరు 1.4, వి.కోటలో 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది. .

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.14 కోట్లు

తిరుమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.14 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి, బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 76,291 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 28,495 మంది తలనీలాలు సమర్పించారు.

బాలాంజనేయస్వామికి శాస్త్రోక్తంగా సింధూరార్చన



తిరుమల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): హనుమత్ జయంతి ఉత్సవాల్లో భాగంగా అంజనేయస్వామి జన్మస్థలమైన ఆకాశగంగలో అంజనాదేవి సమేత బాలాంజనేయస్వామికి బుధవారం ఉదయం సింధూరార్చనను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం శ్రీరామచంద్రమూర్తికి, బాలాంజనేయ స్వామివారికి పుష్ప, తులసి అర్చన జరిగింది. టీటీడీ వైఖానస ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు సింధూరం ధరించిన వారికి ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, కీర్తి గడిస్తారని, సింధూరార్చన విశిష్టత, హనుమత్ వైభవం, అంజనాద్రి పర్వతం గురించి వివరించారు. అనంతరం బాలాంజనేయ స్వామికి, సుదర్శన చక్రానికి పంచామృత స్నపన తిరుమంజనాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహించారు. టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

గురుమూర్తి ఎలా గెలిచారంటే..!

కూటమి నుంచి క్రాస్ ఓటింగే వరప్రసాద్ కొంప ముంచింది

తిరుపతి ఎంపీ ఫలితంపై జోరుగా చర్చలు


వరప్రసాద్


గురుమూర్తి

తిరుపతి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ కూటమి అభ్యర్థులే ఘన విజయం సాధించినా కూటమి భాగస్వామి అయిన బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ ఓడిపోవడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఏడు అసెంబ్లీ స్థానాల్లోని అసెంబ్లీ అభ్యర్థులకూ, ఎంపీ అభ్యర్థికీ పడిన ఓట్ల తేడాను పరిశీలిస్తే క్రాస్ ఓటింగ్ జరిగిందనేది స్పష్టమవుతోంది. ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులందరి ఆధిక్యత కలిపి 1.90 లక్షలు కాగా ఇంచుమించు అంతే ఆధిక్యతతో గెలవాల్సిన కూటమి (బీజేపీ) ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు 14వేలకు పైగా తేడాతో ఓటమిపాలయ్యారు.ఈ ఏడు అసెంబ్లీ స్థానాల్లోనూ వైసీపీ అభ్యర్థుల కంటే ఆ పార్టీ ఎంపీ అభ్యర్థి మద్దిల గురుమూర్తికి ఎక్కువ ఓట్లు వచ్చాయి. మొత్తం ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి అభ్యర్థులకు వచ్చిన మొత్తం ఓట్లు 7.40 లక్షలు కాగా ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావుకు మాత్రం 6.08 లక్షలు మాత్రమే వచ్చాయి. అంటే 1.32 లక్షల ఓట్లు తగ్గాయి. అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా చూస్తే గూడూరులో ఎమ్మెల్యే అభ్యర్థి కంటే 24,996 ఓట్లు, సూళ్ళూరుపేటలో 20,575 ఓట్లు, సర్వేపల్లిలో 20,396 ఓట్లు, సత్యవేడులో 19,540 ఓట్లు, శ్రీకాళహస్తిలో 18,100 ఓట్లు, వెంకటగిరిలో 17,390 ఓట్లు, తిరుపతిలో 11,421 ఓట్లు చొప్పున ఎంపీ అభ్యర్థికి తక్కువగా వచ్చాయి. గత ఎన్నికల్లో గూడూరు ఎమ్మెల్యేగా వైసీపీ నుంచీ గెలిచిన వరప్రసాదరావు తాజా ఎన్నికల్లో నోటిఫికేషన్ సమయంలో బీజేపీలో చేరి తిరుపతి ఎంపీ టికెట్ దక్కించుకున్న సంగతి తెలిసిందే. అందువల్ల కూటమి శ్రేణుల్లో లోలోపల అసంతృప్తి రగిలిన ఫలితంగానే క్రాస్ ఓటింగ్ జరిగినట్టు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభంజనం కొనసాగి 21 ఎంపీ స్థానాలు గెలుచుకున్నా చేజేతులా మరొక ఎంపీ సీటు పోగొట్టుకున్నామన్న వేదన కూటమి వర్గాల్లో వ్యక్తమవుతోంది.

స్థానం	చెల్లిన ఈవీఎం ఓట్లు	వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఓట్లు	వైసీపీ ఎంపీ అభ్యర్థి ఓట్లు	ఎంపీ అభ్యర్థికి అదనపు ఓట్లు	కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ఓట్లు	కూటమి ఎంపీ అభ్యర్థి ఓట్లు	ఎంపీ అభ్యర్థికి తగ్గిన ఓట్లు
గూడూరు	192117	80929	96690	15,761	100844	75848	24996
సర్వేపల్లి	193913	86249	96754	10,505	102243	81847	20396
సత్యవేడు	183150	81311	94417	13,106	84626	65086	19540
శ్రీకాళహస్తి	206536	77575	88347	10,772	119554	101454	18100
సూళ్ళూరుపేట	201186	81362	90252	8,890	109724	89149	20575
తిరుపతి	189502	60950	63727	2,777	121205	109784	11421
వెంకటగిరి	196991	87262	96515	9,253	102716	85326	17390
మొత్తం	13,63,395	5,55,638	626702	71,064	7,40,912	608494	1,32,418

పలమనేరు
కుప్పం/పుంగనూరు

అమర్‌కు అభినందనల వెల్లువ




అమరనాథరెడ్డికి అభినందనలు తెలుపుతున్న గంగవరం మాజీ సర్పంచ్ మురళి తదితరులు, ట్రాన్స్‌కో అధికారులు

పలమనేరు, జూన్5: పలమనేరు టీడీపీ కార్యాలయం బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కోలాహలంగా మారింది. పలమనేరు నియోజకవర్గం నుంచే కాక జిల్లాలోని పలు ప్రాంతాలనుంచి కూడా టీడీపీ నాయకులు, ఎన్నికల్లో ఆయన గెలుపు కోసం ప్రచార కార్యక్రమాలు నిర్వహించిన కార్యకర్తలు, ట్రాన్స్‌కో అధికారులు ఎమ్మెల్యేగా గెలిచిన అమరనాథరెడ్డిని కలిసి అభినందనలు తెలియజేస్తూ శాలువాలు, పూలమాలలు కప్పి అభినందనలు తెలిపారు. బైరెడ్డిపల్లి మండల టీడీపీ అధ్యక్షుడు కిషోర్‌గౌడు, మండల నాయకులు, ట్రాన్స్‌కో ఈఈ శ్రీనివాసమూర్తి, పలమనేరు ఏడీఈ చిన్నబ్బ, తమ సిబ్బందితో వచ్చి అమరనాథరెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు.

వి.కోటలో టీడీపీ సంబరాలు

వి.కోట, జూన్ 5: పలమనేరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎన్. అమరనాథరెడ్డి 20 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో గెలుపొందడంతో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ప్రతి పల్లెలో కేకులు కత్తిరించి, బాణసంచా పేల్చుతూ, జెండాలతో సందడి చేశారు. ఇది ప్రజా విజయంగా మండల పార్టీ అధ్యక్షుడు ఏ.ఎం. రంగనాథ్ అభివర్ణించారు. బుధవారం పలమనేరులో అమరనాథరెడ్డిని కలసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి ఈశ్వర్, నేతలు రాంబాబు, చంద్రారెడ్డి, సోమశేఖర్, ధీరజ్, శబరీష్, షేక్ ఉమ్మర్, భక్తవత్సలం, హరినాథరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, విశ్వనాథ్, కుమార్ తదితరులు ఉన్నారు.

పలమనేరులోనూ పట్టుకోల్పోయిన వైసీపీ

పలమనేరు, జూన్5 : పలమనేరు మున్సిపాలిటీలోనూ వైసీపీ పట్టు కోల్పోయింది. వైసీపీ ఆవిర్భావం నుంచి పలమనేరులో జరిగిన ప్రతిఎన్నికలలో వైసీపీ మెజారిటీ ఓట్లు సాధించేది. మున్సిపల్ ఎన్నికల్లో కూడా రెండు సార్లు వైసీపీ వరుసగా ఘనవిజయాన్ని సాధించింది. తొలిసారి 22 వార్డుల్లోను, రెండేళ్లక్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో 24 వార్డుల్లో ఘనవిజయం సాధించింది. అయితే ఈ ఎన్నికల్లో పలమనేరు మున్సిపాలిటీలో టీడీపీకి భారీ మెజారిటీ లభించింది. టీడీపీ అభ్యర్థిగా పోటీచేసిన అమరనాథరెడ్డికి 16,717 ఓట్లు లభించగా వైసీపీ అభ్యర్థిగా పోటీచేసిన ఎమ్మెల్యే వెంకటేగౌడకు 14,215 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి బి. శివశంకర్‌కు 950 ఓట్లు, నోటాకు 191 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో అమరనాథరెడ్డికి 2502 ఓట్ల మెజారిటీ లభించింది.

టీడీపీ నేతలకు సన్మానం



బైరెడ్డిపల్లె, జూన్ 5 : ఎన్నికల్లో టీడీపీ గెలుపుకోసం కృషిచేసి మండలంలో మంచి మెజారిటీ సాధించిపెట్టిన నేతలను బుధవారం పార్టీకార్యకర్తలు, అభిమానులు ఘనంగా సన్మానించారు. టీడీపీ మండలాధ్యక్షుడు కిశోర్‌గౌడు, ప్రధానకార్యదర్శి సుబ్రమణ్యంశెట్టితో పాటు పలువురు నాయకులను ఘనంగా సత్కరించారు. ఆయా పంచాయతీల్లో కూడా పలువురు స్థానిక నేతలను కార్యకర్తలు సన్మానించారు.

వి.కోటలో టీడీపీకి 3565 ఓట్ల మెజారిటీ

వి.కోట, జూన్ 5: వి.కోట మండలంలో టీడీపీ అభ్యర్థి ఎన్.అమనాథరెడ్డికి 3565 ఓట్ల ఆధిక్యత లభించింది. మండల పరిధిలోని 18 పంచాయతీల్లో ఆరు చోట్ల వైసీపీకి మిగిలిన 12 చోట్ల టీడీపీకి మెజారిటీ లభించింది. వి.కోట మేజర్ గ్రామపంచాయతీలో టీడీపీకి అత్యధికంగా 1137 ఓట్లు, ఎస్.బండపల్లెలో 499, కృష్ణాపురంలో 405, బోడిగుట్టపల్లెలో 398, కొంగాటంలో 347, బైరుపల్లెలో 306, జవ్వునిపల్లెలో 252, గోనుమాకులపల్లెలో 238, బోయచిన్నాగనపల్లె 222, కుంభార్లపల్లె 149, పాముగానిపల్లె 191, ఓగులో 119 ఓట్లు మెజారిటీ వచ్చాయి. అలాగే వైసీపీకి ముదరందొడ్డిలో 320, నెర్నపల్లె 232, చింతమాకులపల్లె 68, తోటకనుమ 44, పెద్దబరిణేపల్లె 35, యాలకల్లులో కేవలం 8 ఓట్లు ఆధిక్యం లభించింది. గత ఎన్నికల్లో వైసీపీకి 5వేల ఓట్లు ఆధిక్యంరాగా, ఈ ఎన్నికల్లో టీడీపీకి 3565 ఓట్లు ఆధిక్యత రావడంతో తిరిగి వి.కోట కంచు కోటగా మారిందని టీడీపీ శ్రేణులు భావిస్తున్నారు.

అధైర్యపడకండి.. అండగా ఉంటా : చల్లా



రొంపిచెర్లలో చల్లాబాబు ఇంటి వద్ద సందడి

రొంపిచెర్ల, జూన్ 5: పుంగనూరు నియోజకవర్గంలో టీడీపీ ఓటమి చవిచూసినా అధైర్యపడకండి... అందరికీ తాను అండగా ఉంటానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. ఎన్నికల్లో 6538ఓట్ల తేడాతో ఓటమి చవిచూశారు. దీంతో బుధవారం పుంగనూరు, చౌడేపల్లి, సదం, సోమల, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున వచ్చి చల్లాబాబును పరామర్శించారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ గడచిన రెండు సంవత్సరాల నుంచి నావెంట ఉండి, అక్రమకేసులు అనుభవించి, కష్టాలలో అండగా వుండి తెలుగుదేశం పార్టీకి ఆదరణ కల్పించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు అని చెప్పారు.

నల్లారి కిశోర్‌ను కలసిన పుంగనూరు టీడీపీ నేతలు



పుంగనూరు రూరల్, జూన్ 5: పీలేరు ఎమ్మెల్యేగా గెలిచిన నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డిని పుంగనూరు టీడీపీ నాయకులు కలిసి గజమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం కలికిరి మండలం నగిరిపల్లెలోని ఆయన స్వగృహంలో కిశోర్‌ను అభినందించి సన్మానం చేశారు. టీడీపీ జిల్లా కార్యదర్శి ఆసూరి బాలాజీ, రాష్ట్ర తెలుగురైతు అధికార ప్రతినిధి సోమల సురేశ్ మాట్లాడుతూ టీడీపీ గెలుపుతో రాష్ట్రానికి మంచి రోజులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి



మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ, ఎన్‌ఎస్ఎస్ విద్యార్థులు

పలమనేరు, జూన్ 4: పలమనేరులో బుధవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పలమనేరు గ్రంథాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రకృతి సంస్థ కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్ర, అటవీ శాఖ అధికారి శివన్న మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో పలమనేరు పరిరక్షణ సమితి కార్యదర్శి నరసింహులు, గిరిధరమూర్తి, సీతారామయ్య, విజయ్ కుమార్ రెడ్డి, రెడ్డెప్పనాయుడు, విజయ్‌కుమార్, తులసినాథనాయుడు, ధనంజయ, సదానందరెడ్డి, నవీన్, విజయ్, మధు తదితరులు పాల్గొన్నారు. పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో కూడా పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. వెంకటేసులు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిదంబరం, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఆర్. వెంకటేష్‌బాబు, టి. బాలాజి, అధ్యాపకులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



పుంగనూరు రూరల్, జూన్5: శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం హోమ్ సైన్స్ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసిన పుంగనూరు మండలం పెద్దఅలసాపురానికి చెందిన కిమీరా అంబటికి డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈమె ప్రొఫెసర్ కెవి. సుచరిత ఆధ్వర్యంలో ఫార్ములేషన్, స్టాండరైజేషన్ అండ్ డెవలెప్‌మెంట్ ఆఫ్ ల్యాక్టోస్ ఫ్రీ మిల్క్ విత్‌మిల్లెట్స్ అండ్ ఇట్స్ ఎఫెక్ట్ ఆన్‌గ్రోత్ ఇన్ అల్‌బినోరాట్స్ అనే అంశంపై పరిశోధన చేశారు.

పాతపేటలో దౌర్జన్యానికి
పాల్పడిన నలుగురిపై కేసు

బైరెడ్డిపల్లె, జూన్ 5 : మండలంలోని పాతపేటలో సర్పంచ్ మమత కుటుంబీకులపై దాడిచేసి దౌర్జన్యానికి పాల్పడిన నలుగురు టీడీపీ నాయకులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు... పాతపేటలో మంగళవారం రాత్రి టీడీపీ శ్రేణులు సంబరాలు చేసుకుంటూ టపాకాయలు పేల్చడంతో సర్పంచ్ మమత ఇంటిదగ్గర వున్న పిల్లలపై పడింది. దీని గురించి సర్పంచ్ భర్త రవిచంద్ర ప్రశ్నించడంతో టీడీపీ నాయకులు రవిచంద్రపై దాడిచేసి గాయపరచినట్లు ఎస్ఐ చెప్పారు. సుబ్రమణ్యంశెట్టి, నాగరాజు ప్రమేయంతో రాజేష్, అజిత్‌కుమార్ దాడికి పాల్పడినట్లు సర్పంచ్ భర్త రవిచంద్ర ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జయహో చంద్రన్నా!

కుప్పంలో అంబరాన్నంటిన టీడీపీ సంబరాలు




కుప్పం మండలం మల్లానూరులో టీడీపీ సంబరాలు, పెద్దలకు పాద నమస్కారం చేస్తున్న కన్నన్ దంపతులు

కుప్పం, జూన్5: ఐదేళ్ల చెర.. అక్రమ కేసులు, నిర్బంధాలు, దాడులు, జైళ్లు, బెయిళ్లు. ప్రశ్నించే గొంతుకలకు శ్వాస ఆడని పరిస్థితి. ఈ దుర్భర పరిస్థితినుంచి తెలుగుదేశం పార్టీ ఒక్కసారిగా ఊపిరి పీల్చుకుంది. రెట్టించిన విజయోత్సాహంతో అంబరాన్నంటేలా సంబరాలు చేసుకుంటోంది. ర్యాలీలు, పూలు, డప్పులు, డ్యాన్సులతో కుప్పంలో వాడవాడా హోరెత్తిపోతోంది. స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు విజయోత్సవ ర్యాలీని కుప్పంలో బుధవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అంతకుముందు స్థానిక ప్రసన్న తిరుపతి గంగమాంబ ఆలయంలో అమ్మవారి పాదాల ముందు ఎమ్మెల్యేగా చంద్రబాబు గెలిచినట్లుగా నిర్ధారిస్తూ ఎన్నికల కమిషన్ ఇచ్చిన డిక్లరేషన్ ఫారాన్ని ఉంచి పూజలు జరిపారు. చంద్రబాబతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు ఆయురారోగ్యాలు ఇవ్వాలని వేడుకున్నారు. అక్కడ నుంచి ఆర్టీసీ బస్టాండు కూడలిదాకా ర్యాలీ జరిపారు. పార్టీ జెండాలు పట్టుకుని జయహో నినాదాలతో టీడీపీ శ్రేణులు ఈ ర్యాలీలో పాల్గొన్నాయి. ఆర్టీసీ బస్టాండు కూడలి వద్ద ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, టీడీపీ నియోకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సురేశ్‌బాబు, టీడీపీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు ఎన్టీఆర్ విగ్రహానికి, డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే కుప్పం మండల వ్యాప్తంగా కూడా టీడీపీ సంబరాలు పెద్దయెత్తున సాగాయి. డప్పులు, డ్యాన్సులతో కార్యకర్తలు ర్యాలీలు తీసి, సంబరాలు జరుపుకున్నారు. మిఠాయిలు పంచిపెట్టుకున్నారు. ఆలయాలలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్ కుమార్, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్లకు సత్కారం

ఎన్నికలు ముగిసి, టీడీపీ ఘన విజయం సాధించిన వేళ, బుధవారంనాడు టీడీపీ కుప్పం పట్టణ కోర్ కమిటీ సభ్యుడు కన్నన్ దంపతులు కొత్తపేటలో అత్యధిక మెజారిటీకి కారకులైన ఓటర్లను ఇంటికి పిలిచి సాదరంగా సన్మానించి పంపారు. వారిలో వయసులో పెద్దలైన వారికి కొత్తబట్టలు పెట్టి, పాద నమస్కారాలు చేసి, ఆశీస్సులు తీసుకున్నారు.

పుంగనూరులో టీడీపీ, జనసేన నేతల విజయోత్సవాలు




పుంగనూరులో సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ, జనసేన నాయకులు

పుంగనూరు, జూన్ 5: ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించడంతో పుంగనూరులో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు బుధవారం విజయోత్సవాలు జరుపుకున్నారు. ర్యాలీగా నినాదాలు చేస్తూ విరూపాక్షిమారెమ్మ ఆలయం వద్దకు చేరుకుని 108 కొబ్బరికాయలను కొట్టారు. అక్కడ నుంచి ఎన్టీఆర్ సర్కిల్ చేరుకుని కేక్‌కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు శ్రీకాంత్, మాదవరెడ్డి, దినేశ్, పోలీస్‌గిరి, దేశాధిప్రకాశ్, సుబ్రహ్మణ్యంరాజు, కుమార్‌రాజా, గంగాధర్, కుమార్, శ్రీనివాసులు, రామయ్య, మునిరాజ, గంగులప్ప, రమణ, నౌషాద్, ఇమ్రాన్. షామీర్, జనసేన నాయకులు పగడాల రమణ, విరూపాక్షి, నరేశ్ రాయల్, బాబు, బాలాజీనాయక్, హరినాయక్, చైతన్యరాయల్, వెంకటేశ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

సోమల : కూటమి విజయంతో టీడీపీ, జనసేన శ్రేణులు బుధవారం నంజంపేట, కందూరు, పెద్ద ఉప్పరపల్లె, ఇరికిపెంట, ఆవులపల్లెల్లో సంబరాలు చేసుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయుడు, జనసేన అధ్యక్షుడు నాగభూషణం రాయల్, హరిప్రసాద్, ఉమాపతినాయుడు, అష్రఫ్‌అలీ, వేణుగోపాల్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు, విశ్వనాథం, రమేశ్ నాయుడు పాల్గొన్నారు.

విజయోత్సవాన్ని అడ్డుకున్న వైసీపీ కార్యకర్తలు

కూటమి విజయోత్సవం చేసుకుంటున్న టీడీపీ కార్యకర్తలను వైసీపీ కార్యకర్తలు అడ్డుకున్న ఘటన సోమల మండలంలో చోటుచేసుకుంది. మంగళవారం రాత్రి వల్లిగట్ల పంచాయతీ వెంగంవారిపల్లెలో టీడీపీ కార్యకర్తలు నగేశ్, చిన్నప్పలు వీధిలో కేక్ కట్‌చేసి టపాసులు కాల్చారు. అదే వీధిలోని వైసీపీ కార్యకర్తలు సి.మధు, అనిల్, వెంకట్రమణలు అడ్డుకున్నారు. వైసీపీ హయాంలో వేసిన రోడ్డుపై కేక్ కట్ చేయరాదని వివాదానికి దిగారు. వీరి మధ్య ఘర్షణ జరిగింది. ఇరువర్గాల వారు దూషించుకున్నారు ఈ వివాదంలో నగేశ్, చిన్నప్పలు గాయపడ్డారు.

చౌడేపల్లె : స్థానిక నడివీధి గంగమ్మ ఆలయం వద వ్యాపారవేత్త లక్ష్మిపతిరాజు ఆధ్వర్యంలో టీడీపీ జెండాను ఊపుతూ, కార్యకర్తలకు సీట్స్ పంచి సంబరాలు జరుపుకొన్నారు. టీడీపీ నాయకులు ప్రదీప్, హరి, కార్తీక్, రెడ్డి, ధర్మతేజ, సాగర్‌నాయుడు పాల్గొన్నారు.

కల్లూరు : ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించడంతో పాళెం పంచాయతీ తుడుంవారిపల్లె, కల్లూరు దిగువవీధిలో బుధవారం రాత్రి టీడీపీ శ్రేణులు, చిన్నారులు సంబరాలు చేసుకున్నారు. చల్లా బాబురెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు.




నంజంపేటలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ జనసేన నాయకులు, చౌడేపల్లెలో సంబరాలు జరుపుకుంటున్న టీడీపీ నాయకులు

పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్య సమాజం





పీఈఎస్ నర్సింగ్ కళాశాల, కేఈసీలో మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాళ్లు తదితరులు

కుప్పం, జూన్5: పర్యావరణ పరిరక్షణతోనే ఆరోగ్య సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని కుప్పంలోని పీఈఎస్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ అండ్ డీన్ డాక్టర్ హెచ్ఆర్.కృష్ణారావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పీఈఎస్ నర్సింగ్ కళాశాల ఆవరణలో అధ్యాపకులు, సిబ్బంది కలిసి మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మొక్కలను పెంచుతూ పోతే పర్యావరణం సమతుల్యమై కాలుష్యం దూరమవుతుందని తెలియజెప్పారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్‌కే.సుబ్రమణ్య, పీఈఎస్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అభిరామి, ఫ్యాకల్టీ సభ్యులు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు, వలంటీర్లు, నర్సింగ్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అలాగే కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో ఆవరణలో సైతం మొక్కలు నాటారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బీసీఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ.నాగరాజ్ మాట్లాడుతూ క్షీణిస్తున్న పర్యావరణ సమతుల్యత మొక్కల పెంపకం ద్వారానే సాధ్యమవుతుందని చెప్పారు. ప్రిన్సిపాల్ ఎస్.సుధాకర్‌బాబు, ఆర్అండ్‌డీ డైరెక్టర్ కోదండరామయ్య, ఎన్ఎస్ఎస్ విభాగం కోఆర్డినేటర్ గంగాధరన్, లైబ్రేరియన్ శరవణ, పీఆర్వో ప్రవీణ్‌కుమార్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే కుప్పం అటవీ శాఖ ఆధ్వర్యంలో సైతం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లయన్స్ క్లబ్ తరఫున సీడ్ బాల్స్, గొడుగులను అటవీశాఖకు అందజేశారు. అటవీ శాఖ ఎఫ్ఆర్‌వో జయశంకర్, డీఎఫ్‌వో కృష్ణప్రసాద్, కంగుంది డీఎఫ్‌వో పుల్లయ్య, రామకుప్పం డీఎఫ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి, సిబ్బంది, లయన్స్ క్లబ్ రీజనల్ చైర్మన్ మహేశ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి కర్తవ్యం

కల్లూరు : పర్యావరణ పరిరక్షణ మనందరి కర్తవ్యమని ఎంఈఓలు శిద్దరామయ్య, పోకల తాతయ్య తెలిపారు. కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురష్కరించుకొని నేషనల్ గ్రీన్‌కోర్ ఆధ్వర్యంలో నా నేల-నా మొక్క అనే నినాదంతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణతోనే భవిష్యత్ తరాలను కాపాడుకోగలమన్నారు. కార్యక్రమంలో గ్రీన్‌కోర్ డివిజనల్ కన్వీనర్ రాజేంద్ర, గ్రీన్ మాస్టర్ వెంకటశిద్దులు, ఉపాధ్యాయులు చంద్రబాబు, రేణుకాదేవి, రాజశేఖర్, వెంకటరత్నం, సైదుల్లా, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రాక్షసపాలన నుంచి విముక్తి కోరుకున్న ప్రజలు : టీడీపీ

రామకుప్పం, జూన్ 5: రాష్ట్రంలో వైసీపీ రాక్షసపాలన నుంచి ప్రజలు విముక్తి కోరుకున్నారని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ కార్యనిర్వాహకకార్యదర్శి పత్రరాయణాచారి, మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ అధ్యక్షుడు ఆంజినేయరెడ్డి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, మాజీ వైస్ఎంపీ చిన్నకృష్ణలు తెలిపారు. బుధవారం వారు రామకుప్పం టీడీపీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, ఆ పార్టీ శ్రేణుల అరాచకాలు, దౌర్జన్యాలతో ప్రజలు విసిగి వేసారిపోయారన్నారు. ఇచ్చిన హామీల మేరకు అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించడమే కాకుండా, దానికి సమాంతరంగా అభివృద్ధి కార్యక్రమాలు చేడుతుందన్నారు. ఈ సమావేశంలో తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, నేతలు రామ్మూర్తి, సీతాపతి, గంట్లప్పగౌడు, శ్రీనివాసులురెడ్డి, జయశంకర్, గంట్లరెడ్డి, నాగభూషణం, మనోహర్, సలాంసాబ్, కృష్ణానాయక్, గజేంద్ర, మహ్మద్‌రఫీ, సత్తి, నందారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, వెంకటరమణ, జయశంకర్ రామలింగారెడ్డి, రామకృష్ణప్ప, బాలరాజు. సుబ్రి, సతీష్, అవినాశ్, మంజునాథ్, సాగర్‌రెడ్డి, నరసింహులు, ఆదిల్, చలపతి, ఆంజి, నిసార్, శంకర్, మిఠాయి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణం ప్రజాపాలన

రామకుప్పం : రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా టీడీపీ కూటమి పాలన సాగుతుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి తెలిపారు. బుధవారం రాత్రి లింగాపురంలో పార్టీ శ్రేణులు నిర్వహించిన విజయోత్సవ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నో ఆశలతో కూటమిని ఆదరించిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్‌రెడ్డి, మోహన్‌బాబు, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సల్లాపురెమ్మ ఆలయంలో దుర్గాహోమం



బైరెడ్డిపల్లె, జూన్ 5 : పట్టణంలో వున్న సల్లాపురెమ్మ ఆలయంలో బుధవారం దుర్గాహోమం నిర్వహించారు. అర్చకులు నాగేంద్ర కలశారాధన, లలితాసహస్ర హోమం, మృత్యుంజయ హోమం, జయాది హోమం, పూర్ణాహుతి, చక్ర కుంకుమార్చన జరిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

'ఈవీఎంల సీళ్ల తొలగింపుతో గెలిచిన పెద్దిరెడ్డి'



పోలీస్‌స్టేషన్‌ముందు మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

చౌడేపల్లె, జూన్5: సదుంలో ఈవీఎంల సీళ్ళు తొలగించి రిగ్గింగులు చేసి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గెలిచాడని టీడీపీ నాయకులు ఆరోపించారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ ముందు మీడీయాతో వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో సుమారు 42 వేలు మెజార్టీ ఉన్న పెద్దిరెడ్డి ఓటమిని ముందే గ్రహించి సొంత మండలమైన సదుంలోని గడ్డవారిపల్లె, ఎర్రాతివారిపల్లె, పులిచర్ల మండలం ఎర్రపాపిరెడ్డిగారిపల్లె, బోడిరెడ్డిగారిపల్లె పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలకు సీళ్ళు తొలగించి రిగ్గింగ్‌కు చేసుకుని గెలిచారన్నారు. గత ఎన్నికల్లో చౌడేపల్లె మండలం సుమారు 6500 ఓట్లు వైసీపీ మెజార్టీ సాధించిందని, అయితే ఈసారి వైసీపీ కన్నా 962ఓట్లు మెజార్టీ సాధించామన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షులు గువ్వల రమేష్‌రెడ్డి, టీడీపీ నాయకులు ప్రముఖ వ్యాపారవేత్త లక్ష్మీపతిరాజు, నాయకులు గిరిరాజు, ప్రదీప్‌రాజు, హరి, కార్తిక్, రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ ఆర్థికసాయం

రామకుప్పం, జూన్ 5: పంద్యాలమడుగు పంచాయతీ పల్లికుప్పం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త బాటప్ప బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. తెలుగు యువత మండల అధ్యక్షుడు విశ్వనాథ్, పార్టీ సీనియర్ నేతలు చంద్రశేఖర్‌రెడ్డి, అప్పొలప్ప, మునిరాజనాయక్, మురుగేష్ తదితరులు బాటప్ప మృతదేహానికి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబసభ్యులకు పార్టీ తరపున రూ.10వేలు అందజేశారు.

పెరుగుతూ... తగ్గుతూ ఉన్న టమోటా ధరలు



పలమనేరు, జూన్5 : వర్షాల కారణంగా పలమనేరు మార్కెట్‌లో టమోటా ధరలు వరుసగా పెరుగుతూ.. తగ్గుతున్నాయి. జూన్ 1వతేది మార్కెట్‌లో టమోటా కిలో రూ.26 నుంచి రూ.27 ధర పలుకగా, 2వ తేది కిలో టమోటా ధర రూ. 26నుంచి రూ.28 వరకు పలికాయి. 3వ తేది అనూహ్యంగా కిలో టమోటా ధర గరిష్టంగా రూ. 38కి చేరింది. అటుపిమ్మట జూన్ 4న మళ్లీ టమోటా ధరలు అనూహ్యంగా కిలో రూ. 48నుంచి 53 వరకు ధర పలికాయి. అయితే 5వ తేది బుధవారం పలమనేరు మార్కెట్‌లో టమోటా ధరలు పతనమై మళ్లీ కిలో రూ 35నుంచి 37 పలికాయి.

నానీకి నేతల అభినందనలు



చిత్తూరు సిటీ, జూన్ 5: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన పులివర్తి నానీకి చిత్తూరు పార్టీ నేతలు అభినందనలు తెలిపారు. బుధవారం తిరుపతిలోని నాని నివాసంలో కలసిన నేతలు అభినందించి, ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఇందులో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు చంద్రప్రకాష్, త్యాగరాజన్, జగదీశ్వర్ నాయుడు తదితరులున్నారు.

టీడీపీ విజయంతో తలనీలాల సమర్పణ



ఐరాల(కాణిపాకం), జూన్ 5: సార్వత్రిక ఎన్నికలలో టీడీపీ విజయం సాధించడంతో మండలంలోని బొమ్మసముద్రం గ్రామానికి చెందిన పలువురు యువకులు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో బుధవారం తలనీలాలు సమర్పించారు. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి టీడీపీ నాయకులు వచ్చి తలనీలాలు సమర్పించి, స్వామిని దర్శించుకున్నారు.

మొక్కుల చెల్లింపు



చిత్తూరు కల్చరల్, జూన్ 5: ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం సాధించడంతో నగరంలోని జీకే నగర్‌కు చెందిన పలువురు బుధవారం అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో మొక్కులు చెల్లించుకు న్నారు. 185 కొబ్బరి కాయలు సమర్పించారు. స్వామిని స్తుతిస్తూ భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో తాడిపత్రి బాషా, రవి శంకర్‌రెడ్డి, జీబీ గోపి, మునీంద్ర, మహాలక్ష్మి, గౌరీశంకర్, జానకిరామయ్య, హరినాగభూషణం, ఆవుల రమేష్, కరుణ, హరినాయుడు పాల్గొన్నారు.

ఘనంగా మాస శివరాత్రి పూజలు



మొక్కలు నాటుతున్న సత్యసాయి సంస్థాన్ సభ్యులు

చిత్తూరు కల్చరల్, జూన్ 5: గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో బుధవారం సాయిలింగేశ్వర స్వామికి మాసశివరాత్రి పూజలు ఘనంగా నిర్వహించారు. రుద్రాభిషేకం, అర్చన, విశేష పూజలు చేశారు. భక్తులకు సత్యసాయి సేవాసమితి నిర్వాహకులు ఉచితంగా పూజా ద్రవ్యాలు అందజేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సంస్థాన్ ఆవరణతోపాటు పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు.

దారిలేని పొలాన్ని అంటగట్టిన కేసులో జైలు శిక్ష

విజయపురం, జూన్ 5: మండలంలోని జగన్నాథపురంలో తనకు దారి లేని పొలం అంటగట్టారని చెన్నైకి చెందిన సంతానకృష్ణ కోర్టులో వేసిన కేసుపై బుధవారం విచారణ జరిగింది. మోసానికి పాల్పడిన ప్రభాకర్‌రాజు, చెంచురాఘవరాజు, లక్ష్మమ్మలకు రెండేళ్ల తొమ్మిది నెలల జైలు శిక్ష, జరిమానా విధించినట్లు ఎస్‌ఐ జయప్ప తెలిపారు.

చంద్రప్రకాష్‌కు ఘన సన్మానం



చిత్తూరు రూరల్, జూన్ 5: చిత్తూరు నియోజకవర్గంలో టీడీపీ ఘన విజయం సాధించడంతో బుధవారం ఆ పార్టీ జిల్లా నేత చంద్రప్రకాష్‌ను ఆయన నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సన్మానించారు. అర్బన్ నేతలు కూడా ఆయన్ను సన్మానించారు.

కాణిపాకానికి మహిళల పాదయాత్ర



తవణంపల్లె, జూన్ 5: మండలంలోని తెల్లగుండ్లపల్లె సర్పంచ్ మాధవీ మోహన్‌నాయుడు ఆధ్వ ర్యంలో గ్రామానికి చెందిన 300 మంది మహిళలు బుధవారం కాణిపాకం వరకు పాదయాత్ర చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించి, చంద్రబాబు సీఎం అయితే కాలినడకన కాణిపాకం వస్తామని మొక్కుకున్నామని, ఆ మేరకు మొక్కు తీర్చుకున్నామని అన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు గాలి దిలీప్, నాయకులు మోహన్‌నాయుడు, గోపి యాదవ్, సారంగపాణి పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనకు గుణపాఠం

గుడిపాల, జూన్ 5: వైసీపీ అరాచక పాలనకు ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు ఒక గుణపాఠమని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఐదేళ్లలో ప్రజలను నానా హింసలకు గురిచేయడంతో ప్రజలు టీడీపీకి పట్టంకట్టారన్నారు. ప్రజలు తిరగబడితే ఎలా ఉంటుందో తెలుసుకుని నడుచుకోవాలని హితవు పలికారు.

వైభవంగా రథోత్సవం



కార్వేటినగరం, జూన్ 5: స్థానిక వేణుగోపాలస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం వైభవంగా నిర్వహించారు. కళా ప్రదర్శనలు ముందు సాగగా రథంపై ఆశీనుడైన మువ్వ గోపాలుడు ఆలయ మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయంలో ఊంజల సేవ నిర్వహించారు. రాత్రి అశ్వ వాహనంపై స్వామివారు పురవీధుల్లో ఊరేగారు. భక్తులు కర్పూర హారతి నీరాజనాలు అర్పించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు పాల్గొన్నారు.

ఎన్డీఏ విజయంపై పూజలు



కార్వేటినగరం, జూన్ 5: రాష్ట్రంలో కూటమి విజయం సాధించడం పట్ల మండల టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బంగారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయం ముందు కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొన్నా యుగంధర్, బీజేపీ మండలాధ్యక్షుడు రాజశేఖర్, టీడీపీ నాయకులు తిరుమలనాథ్, రవియాదవ్, జగన్నాథం, వాసుదేవరెడ్డి, నటరాజు, గురువర్ధ పాల్గొన్నారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

సమష్టి కృషితోనే విజయాలు

ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారికి స్వాగతాలు.. సన్మానాలు





నగరి, విజయపురంలో గాలి భానుప్రకాష్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ నేతలు - జీడీనెల్లూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన థామస్‌ను టీడీపీ నేతలతో కలిసి సన్మానిస్తున్న భీమనేని చిట్టిబాబు నాయుడు

నగరి, జూన్ 5: ఎమ్మెల్యేగా ఎన్నికై నగరికి వచ్చిన గాలి భానుప్రకాష్‌కు టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. నగరి మండపం వద్ద చింతలపట్టెడ వాసులు, నగరి టీడీపీ నాయకులు శాలువలు, పూలమాలలతో సన్మానించారు. అక్కడి నుంచి పార్టీ కార్యాలయానికి ర్యాలీగా చేరుకున్నారు. వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ఆశీర్వదించారు. కాగా, ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంతో ఆ పార్టీ నాయకులు బైక్ ర్యాలీ చేపట్టారు. టీడీపీ కార్యాలయం నుంచి నాగలాపురం రోడ్డు మీదుగా టవర్‌క్లాక్, ఏకాంబరకుప్పం రైల్వేగేట్ వరకు ర్యాలీ సాగింది.

విజయపురంలో..

విజయపురం, జూన్ 5: టీడీపీ మండల కార్యాలయం పన్నూరు సబ్‌స్టేషన్‌కు వచ్చిన గాలి భానుప్రకాష్‌కు టీడీపీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. గజమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమేష్ రాజు, బాబుయాదవ్, ధనుంజయయాదవ్, బాలసుబ్రహ్మణ్యంరాజు, శరవణ, గుణభూషణమ్మ, సుధాకర్‌రాజు, దశరథ రాజు, రామచంద్రారెడ్డి, రఘునాథరెడ్డి, శివలింగం, మహేంద్రన్, రవిచంద్రారెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, సుధానాయుడు, చిన్నబ్బరాజు, బాషా తదితరులు ఉన్నారు.

నిండ్రలో..

నిండ్ర : మండల కేంద్రమైన నిండ్రలో, మేళంబాకంలో విజయోత్సవాలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి, ఎమ్మెల్యేగా ఎన్నికైన భానుప్రకాష్‌ను గజమాలతో, శాలువాలతో ఘనంగా సన్మానించారు. తన గెలుపుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేశ్వరావు, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథరామ, నాయకులు వెంకటేశులునాయుడు, రవినాయుడు, బాబు యాదవ్, గిరిబాబు, ఓంప్రకాష్, బాబునాయుడు, లోకనాథం నాయుడు, తేజేష్, మనోహర్‌నాయుడు, ప్రకాష్, గుణభూషణమ్మ, నిరోషా, సంపూర్ణమ్మ, గాలి రమేష్ నాయుడు, మురళీ నాయుడు, జగన్, ఏటీరాజ్, పెరుమాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, గంగాధర నాయుడు, మనోహర్‌నాయుడు పాల్గొన్నారు.

మురళీమోహన్‌కు ఘనస్వాగతం

బంగారుపాళ్యం, జూన్ 5: పూతలపట్టు ఎమ్మెల్యేగా ఎన్నికైన మురళీమోహన్‌కు టీడీపీ మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయ ప్రకాష్, బీజేపీ, జనసేన నాయకులు ఘనస్వాగతం పలికారు. ఎమ్మెల్యేగా గెలిచి బుధవారం మండల కేంద్రానికి రావడంతో గజమాలలతో స్వాగతం పలికారు. నలగాంపల్లి గ్రామంలో కేక్ కట్‌చేసి అభిమానులకు పంచిపెట్టారు. టీడీపీ కార్యాలయం ఎదుట సన్మానించారు. ప్రభుత్వ కళాశాల వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. ఆదరించిన ప్రజలందరికీ రుణపడి ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్‌పీ జయచంద్ర నాయుడు, ఎన్‌పీ సురేంద్ర నాయుడు, కోదండ యాదవ్, ఎన్‌ఆర్‌ఐ విక్రమ్, ధరణీనాయుడు, కోకా ప్రకాష్ నాయుడు, కమల్‌నాథ్‌రెడ్డి, లోకనాథ నాయుడు, జనార్దన్ గౌడ్, నాగరాజ గౌడ్, మహేంద్ర, రమేష్, జాకీర్ హుస్సేన్, చిన్నయ్య, గిరిబాబు, కొండేటి శివ, కవి, శాంతమూర్తి, బాలు, భానుప్రకాష్ పాల్గొన్నారు.

గురజాల, థామస్‌లకు సన్మానం

పాలసముద్రం, జూన్ 5: చిత్తూరు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల ఎమ్మెల్యేలుగా ఎన్నికైన గురజాల జగన్మోహన్, డాక్టర్ థామస్‌లను బుధవారం పలువురు టీడీపీ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భీమనేని చిట్టిబాబు నాయుడు, నాయకులు వాసు నాయుడు, శేఖర్ రాజు, జె.విజయ్‌కుమార్, రవి నాయుడు, సాంబశివన్, అరుళ్‌నాథన్, మోహన్, దాము రెడ్డి, కేశవులు నాయుడు పాల్గొన్నారు.

అమర్‌ను కలిసిన మురళీమోహన్

పూతలపట్టు, జూన్ 5: పలమనేరు ఎమ్మెల్యేగా ఎన్నికైన అమరనాథరెడ్డిని పూతలపట్టు ఎమ్మెల్యేగా ఎన్నికైన మురళీ మోహన్ బుధవారం పలమనేరులోని ఆయన నివాసంలో కలిశారు. దుశ్శాలువలు, గజమాలలతో సన్మానించి, ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి యువరాజు నాయుడు, మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, అధికార ప్రతినిధి గంగారపు గోపి, టీడీపీ బంగారుపాళ్యం మండలాధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్, జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షుడు హిమగిరి నాయుడు, బాబురావు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్



అమరనాథరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మురళీమోహన్



నిండ్రలో భానుప్రకాష్‌ను సన్మానిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరులో భారీ వర్షం

చిత్తూరు కల్చరల్, జూన్ 5: నగరంలో బుధవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 12నుంచి 3 గంటల వరకు నగరంలో మేఘాలు కమ్ముకున్నాయి. కొంతసేపటి తర్వాత ప్రారంభమైన వర్షం సుమారు గంటపాటు కురిసింది. లోతట్టు ప్రాంతాల్లోకి నీరు చేరింది. పొన్నియమ్మగుడి, చర్చి, బజారు, బ్రాహ్మణ, ఎంజీఆర్ వీధుల్లో నడుము లోతు నీరు పారింది. గాంధీ సర్కిల్‌లోనూ వర్షపు నీరు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. గిరింపేట, ప్రశాంత్‌నగర్, కట్టమంచి, దొడ్డిపల్లె, మురకంబట్టు, కొంగారెడ్డిపల్లె, ఎస్టేట్‌లో వరద ప్రభావం కనిపించింది. పాత బస్టాండులో వర్షపు నీటి ప్రవాహానికి చెత్త పేరుకుపోవడంతో ప్రయాణికులకు అవస్థలు తప్పలేదు.



రోడ్డుపైనే వర్షపు నీరు



కార్వేటినగరం, జూన్ 5: ఆలత్తూరులో రోడ్డుపైనే వర్షపు నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామం నుంచి నీరు బయటకు వెళ్లేందుకు సరైన కాలువ నిర్మాణం చేపట్టకపోవడంతో ఈ దుస్థితి ఏర్పడింది. సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయండి

నగరి, జూన్ 5: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలని ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయలు కోరారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై బుధవారం నగరిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. షాపులను పరిశీలించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఆర్‌పీలు, పార్ట్‌టైం ఇన్‌స్పెక్టర్లు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



పాలసముద్రంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రిన్సిపాల్

పాలసముద్రం, జూన్ 5: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, ప్రతిఒక్కరూ రెండు మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హేమలత కోరారు. ఈ మేరకు బుధవారం కళాశాల ఆవరణలో విద్యార్థులతో మొక్కలు నాటించి, ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

గుడిపాలలో...

గుడిపాల : సీఎస్‌ఆర్ కళాశాలలో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ రామచంద్ర, మాంటికార్లో మిటెడ్ చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ షామ్‌షల్ హ్యక్యూ మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. ప్రాజెక్టు మేనేజర్ రమేష్‌చంద్ర హట్టి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి అర్జున్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నగరిలో..

నగరి, జూన్ 5: మండలంలోని పాఠశాలల్లో ఎంఈవోలు శ్రీదేవి, నమశ్శివాయలు ఉపాధ్యాయులు మొక్కలు నాటారు. కాకవేడు, వినాయకపురం పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మనోహర్‌నాయుడు ప్రోత్సాహంతోనే రాజకీయాల్లోకి..

గంగాధరనెల్లూరు ఎమ్మెల్యే డాక్టర్ థామస్



మనోహర్‌నాయుడు సమాధి వద్ద నివాళి అర్పిస్తున్న థామస్

గంగాధరనెల్లూరు, జూన్ 5: తెలుగు రైతు విభాగం మాజీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దివంగత పాచిగుంట మనోహర్‌నాయుడు ప్రోత్సాహంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని గంగాధరనెల్లూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన థామస్ అన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటిసారిగా థామస్ పాచిగుంట గ్రామానికి చేరుకుని మనోహర్‌నాయుడు సమాధి వద్ద నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ చెన్నైలో తాను వైద్యవృత్తిలో పేదలకు అందిస్తున్న సేవలను చూసి, రాజకీయాల్లోకి వస్తే మరింత ఎక్కువగా సేవ చేయవచ్చునని చెప్పి ప్రోత్సహించారని తెలిపారు. మనోహర్‌నాయుడు మృతి పార్టీకి తీరని లోటని, వారసులుగా కుమార్తె శిల్ప, ఆయన చిన్నాన్న కుమారుడు రఘునాథనాయుడు రాజకీయాల్లో రాణించాలని, వారికి తాను అండగా ఉంటానని తెలిపారు. తన గెలుపునకు పనిచేసిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎస్పీ చిన్నస్వామి, తెలుగు యువత మాజీ కార్యనిర్వాహక కార్యదర్శి దేవపత్ని ధనంజయనాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు స్వామిదాస్, జనసేన నియోజకవర్గ కన్వీనర్ పొన్నా యుగంధర్, నేతలు కామసాని కోదండరెడ్డి, జ్యోతియాదవ్, తులసిరెడ్డి, వెంకటేశులునాయుడు, మోహన్, నెల్లేపల్లె సుబ్రమణ్యం, నీరజాక్షులురెడ్డి, రాఘవేంద్ర, శ్రీనివాసులుశెట్టి, మురళీశ్వరరెడ్డి, మునిరత్నంనాయుడు, రాము, నరసింహులు, వినాయకం, రాజేంద్రన్, మునస్వామి పాల్గొన్నారు.

టీడీపీ గెలుపుపై సంబరాలు



నగరి, జూన్ 5: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు మరోసారి సీఎం కానున్న సందర్భంగా పట్టణ పరిధిలోని సామాలమ్మ గుడిలో రామానుజం చలపతి, లత ఆధ్వర్యంలో పూజలు చేయించారు. మొక్కులు చెల్లించుకున్నారు. ఒకటి, మూడో వార్డు ఓటర్లకు కృతజ్ఞతలు, బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం



పెనుమూరు, జూన్ 5: మాసశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని కావూరివారిపల్లి రుణ విమోచన స్వామి ఆలయంలో బుధవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయమే స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి, వేదమంత్రాల నడుమ భక్తుల దర్శనానంతరం కల్యాణోత్సవం నిర్వహించారు. పులికల్లు గ్రామానికి చెందిన ప్రభాకర్‌రెడ్డి దంపతు లు ఉభయదారులుగా వ్యవహరించారు. ధర్మకర్త కృపానందంపిళ్లై, నాగరాజు పాల్గొన్నారు.

జీజేఎం గెలుపుతో మొక్కుల చెల్లింపు



గుడిపాల, జూన్ 5: గురజాల జగన్మోహన్ ఎమ్మెల్యేగా, చంద్రబాబు సీఎంగా గెలుపొందిన సందర్భంగా మండలంలోని రామభద్రాపురం పంచాయతీ ముట్టుకూరుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు ఈశ్వర్ నాయుడు, గ్రామస్తులు గ్రామదేవత సత్తెమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. జీజేఎం ఛారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు, టీడీపీ నాయకులు వెంకటేష్ యాదవ్, వరదరాజులు యాదవ్, జగదీశ్వర్ నాయుడు, వెంకటేష్ నాయుడు, సాంబశివ నాయుడు, మునిరత్నం యాదవ్, చంద్రశేఖర్ యాదవ్, ఏకాంబరం యాదవ్, మహిళలు మధు, సుమిత్ర, లీల, లోకమ్మ, ధనమ్మ తదితరులు పాల్గొన్నారు.

దగ్గుమళ్ల, గురజాలకు అభినందనల వెల్లువ



దగ్గుమళ్లకు అభినందనలు తెలుపుతున్న రాజేశ్వరి



ఫిలిడెల్ఫియాలో ఎమ్మెల్యే గురజాల ఫొటోతో ఎన్ఆర్ఐల విజయోత్సవాలు

చిత్తూరు సిటీ, జూన్ 5 : చిత్తూరు ఎంపీగా భారీ మెజారిటీతో విజయం సాధించిన దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యేగా ఎన్నికైన గురజాల జగన్మోహన్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. బుధవారం ఉదయం నుంచి వందలాదిగా నేతలు ఎంపీ, ఎమ్మెల్యే నివాసాల వద్దకు చేరుకుని పుష్పగుచ్ఛాలు ఇచ్చి, శాలువలు కప్పి అభినందనలు తెలిపారు. తమ విజయం కోసం కష్టపడి పనిచేసిన టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అందరూ కష్టపడి పనిచేసినందువల్లే విజయం సాధ్యమైందన్నారు.

అమెరికాలో టీడీపీ శ్రేణుల సంబరాలు

రాష్ట్రంలో కూటమి విజయం సాధించడంపై అమెరికా ఫిలిడెల్ఫియాలో ఎన్ఆర్ఐలు సంబరాలు జరుపుకున్నారు. చిత్తూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన జగన్మోహన్‌కు అభినందనలు తెలుపుతూ సంబరాలు జరుపుకున్నారు. ఎన్ఆర్ఐలు రవి, తేజ, ముత్తు, సంఘమిత్ర గంగవరపు, అరవింద్ దారుపూరు పాల్గొన్నారు.



గురజాలను అభినందిస్తున్న టౌన్‌బ్యాంక్ మాజీ చైర్మన్ షణ్ముగం, మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ మాపాక్షి మోహన్